# అబ్బే ఏంలేదు

భుజంగం ఈ మధ్యనే రిటైర్ అయ్యాడు! ఓ ఆర్నెల్లకి రిటైర్ అవుతాడనగా ఓ యిల్లు కట్టాడు. "ఇంతకాలం అద్దెయింట్లో ఉన్నాం! యిప్పుడు సొంత యింటి గురించి ఎందుకొచ్చిన తాపత్రయం!" అంది భార్య. "మన పిల్లాడు యింజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. వాడికి ఉద్యోగం వస్తుంది! ఏం కష్టపడంలే" అన్నాడు భుజంగం.

శ్రీమతి, భుజంగానికి వైజాగ్ బదిలీ అయింది! "ఎక్కడ హైదరాబాద్! ఎక్కడ వైజాగ్! ఓ సారి వచ్చి వెడితో బోల్డు ఖర్చులు! ఇల్లు కట్టేటప్పుడు చేసిన అప్పులు కూడా తీర్చాలి" అని బాధపడింది.

పిల్లాడ్ని పెట్టుకుని, భుజంగం భాగ్యనగరంలో ఉండిపోయాడు. కొత్తగా పెళ్ళయిన ఓ జంట, వీళ్ళ యింట్లోకి కాపురం వచ్చారు. కొడుకు కాలేజీకి వెళ్ళిన తర్వాత, కాలక్షేపంలేని భుజంగం, కొత్తగా కాపరానికి వచ్చిన శ్రీమతి భూదేవితో బాతాఖానీ కొడుతూండేవాడు. ఈ బాతాఖానీ బాధపడలేక "అంకుల్! మీరేమయినా కథలు రాయకూడదా" అంది భూదేవి.

"మంచి సలహా యిచ్చావమ్మా!" అని కథలు రాయడం మొదలెట్టేశాడు. ఈ విషయం తెలుసుకున్న భూదేవి భర్త, "కథలు రాయడమంటే, వీపు గోడకిపెట్టి రాయడమనుకున్నాడు కాబోలు!" అన్నాడు భూదేవితో.

"పోన్లెండీ! ఏదో కాయితాలు నలుపు చేస్తూ కూర్చుంటాడు, నా జోలికి రాకుండా!"

ఓ పది రోజుల తర్వాత రెండు కథలు తెచ్చి భూదేవిని చదవమన్నాడు. సాయంకాలం ఆఫీస్ నుంచి వచ్చిన భర్తకి, ఆ కథలు చూపించింది భూదేవి.

"ఏమిటి ఈ దస్తూరి బ్రహ్మరాతలా ఉంది. ఈయన రాత అసలు బాగాలేదు" అన్నాడు. "బాగా లేనిది ఆయన చేతివ్రాత కాదండీ! నా తలరాత!"

భూదేవి టెన్త్‌క్లాస్ నాలుగుసార్లు మాత్రమే తప్పింది. సరిగ్గా చదవదు. చదివితే మాత్రం అర్థమయ్యే దాకా చదువుతుంది. ఈ కథలు, కష్టపడి ఓ నాలుగు రోజులు అదే పనిగా చదివింది. అర్థం కాలేదు.!

భూదేవి భర్త "కథలు చదివేశాను, బాగున్నాయ్"అని చెప్పి, ఆ కాగితాలు ఆయనకి యిచ్చెయ్" అన్నాడు. "మా వంశంలో ఎవరూ అబద్ధమాడరు" అంది.

నీ ఏడుపు నువ్వేడు! అనుకున్నాడు.

ఓ రోజు రాత్రి భూదేవి భర్తకి హఠాత్తుగా మెలకువ వచ్చింది. తన భార్య మంచం మీద కూర్చుని ఏడవటం చూశాడు. సంక్రాంతి పండగ దగ్గర పడుతోంది కదా. తను అడిగిన చీర కొంటానో లేదో అని ఏడుస్తోంది కాబోలు అని "నీకు పండక్కి మంచిచీర కొంటాను. నువ్ ఏడుస్తూ, నన్ను ఏడిపించకు పడుకో" అన్నాడు.

"ఆ కథలు అర్థమై, నేను బ్రతికుంటే కదా. మీరు కొన్న చీరలు నేను కట్టుకోవడం! నాకు రాత్రిళ్ళు సరిగ్గా నిద్ర పట్టడంలేదు" అంది.

"ఆయన రాసిన కథ పత్రికలో అచ్చవుతుందో లేదో" అని ఆయన ఏడవాలిగాని, మనం ఎందుకు ఏడవడం". కథ అర్థంకాక పోవడం వలన కలిగిన దుఃఖంతో నిద్రపట్టక, పైత్యం చేసి భూదేవికి వాంతులు పట్టుకున్నాయ్.

ఈ వాంతులు అవుతున్నట్లు తెలుసుకున్న యిరుగూ పొరుగు వచ్చి "మొత్తం మీద ఘటికుడవేనయ్యా! ఏమిటో అనుకున్నాం! పెళ్ళయిన కొత్తలోనే మీ శ్రీమతికి వాంతులు తెప్పించావ్" అన్నారు.

"అబ్బే! నాకు తెలీదండి! నేనేం చెయ్యలేదు!" అని వెర్రిమొహం వేశాడు భూదేవి భర్త.

"పాపం! వాంతులకి కారణం మా ఆయన కాదండి! మా యింటాయన!" అంది అభం శుభం తెలేని భూదేవి.

ఆఖరికి ధైర్యంచేసి "మీ కథలు మళ్ళీ మళ్ళీ చదివానుగాని అర్థంకాలేదు. ఏమనుకోకండి" అంటూ, కథలు వెనక్కి యిచ్చేసింది భూదేవి.

పత్రికల్లో "ఫలానా కథ మళ్ళీ మళ్ళీ చదివించింది" అని ఉత్తరాలు రాస్తూంటారు పాఠకులు. నా కథలు అచ్చవకుండానే మళ్ళీ మళ్ళీ చదివించాయ్ నీ చేత. ఈ జన్మకి యిది చాలమ్మా!" అన్నాడు భుజంగం.

"అర్థంకాని కథలు మళ్ళీ మళ్ళీ చదవక తప్పదు కదా" అనుకుంది.

తన కూతురికి వాంతులవుతున్నాయ్ అని తెలుసుకున్న భూదేవి తల్లి, వేవిళ్ళనుకుని పిల్లని చూడడానికి వచ్చింది. "వాంతులు అవుతున్నాయని మాకు ఫోన్ చేస్తే మేం కూడా సంతోషించేవాళ్ళం కదా తల్లీ!" అంది భూదేవి తల్లి.

"కథలు అర్థం కాక నిద్రచెడిపోయి మానసిక వ్యథతో పైత్యంచేసి నేను ఏడుస్తూంటే, నువ్వు సంతోషిస్తావా" అంది భూదేవి.

అసలు విషయాలు తెలుసుకున్న భూదేవి తల్లి తన అన్నగార్ని రప్పించింది. తన భర్తా, అన్నగారూ కలిసి భుజంగాన్ని గట్టిగా తగులుకున్నారు. భూదేవి మేనమామ మంచి బలంగలవాడు. కుస్తీలు కూడా పడతాడు.

"మా మేనకోడల్ని చిన్నప్పట్నుంచీ "పువ్వో... పువ్వో" అని పెంచుకొచ్చాం. ఒక్కనాడు కూడా ఆమెని చదవమని బలవంతం చెయ్యలేదు. పాపం! అది కూడా ఎప్పుడూ పుస్తకాల జోలికి పోలేదు! అటువంటి ఏం తెలియని అమాయకురాలిచేత నీ కథలు చదివిస్తావా! పైగా దాని చేత కక్కించావ్. నా గురించి నీకు తెలీదు! నేను తలచుకుంటే యిప్పటి దాకా నువ్వు దిగమింగిన అద్దె, నీ చేత కక్కిస్తాను. కక్కులకీ, కక్కులకీ చెల్లు! ఓ పదిరోజుల్లో నీ యిల్లు ఖాళీ చేసేస్తాం. నీ యిష్టమొచ్చినట్లు చేసుకో ఫో! అన్నాడు.

"అది కాదండీ! మీ మేనకోడలు కథలు రాయమంటేనే రాశాను! నా అంతట నేనే రాసినట్లు మాట్లాడతారేమిటి! కావాలంటే మీ భూదేవిని అడగండి" అన్నాడు భుజంగం.

"చాల్లేవయ్యా! చెప్పొచ్చావ్! ఈ భూదేవి అక్కయ్యకి యిరవై ఏళ్ళ క్రితం పెళ్ళయింది.

ఒక్క నలుసు కూడా కలగలేదని మా చెల్లెలు బెంగపెట్టుకుని ఏడుస్తోంది. ఈ రెండో పిల్లకి వేవిళ్ళు అనుకుంటే యివి "కథల వాంతులు" అని తేలిపోయింది. మా బాధ నీకర్థం కావటం లేదు. మా మేనకోడలు ప్యాన్ అవవలసిన చోట తప్పింది. తప్పవలసిన నెల

తప్పటం లేదు."

"అది కాదండీ! మీ మేనకోడలికి పిల్లలు పుట్టకపోవడం నా తప్పు అన్నట్లు మాట్లాడతారేమిటి. ఇందులో నా బాధ్యత ఏముంది. నాకర్థమవటం లేదు" అన్నాడు భుజంగం.

"ఎక్కువ తక్కువ మాట్లాడకు! నేనసలే వస్తాదుని. మెడ మీద ఒక్కటిచ్చానంటే అన్నీ అర్థమవుతాయ్."

భుజంగం యిల్లు ఖాళీ అయిపోయింది. కొండకచో కథలు రాస్తే యిల్లు ఖాళీ అయిపోవును అని తెలుసుకున్నాడు భుజంగం

---

(జ్ఞాన జగతి మాసపత్రిక)